క్లుప్తంగా

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పరిసరాల శుభ్రతతో రోగాలు దూరమవుతాయని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డు పాత బస్టాండు సర్కిల్‌లో శనివారం శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటేషన్ అధికారులతో చర్చించారు. ఏయే ప్రాంతాలు, ఏయే వార్డుల్లో పనులు జరుగుతున్నాయి, కాలువల్లో పూడిక, చెత్తకుప్పలను ఎత్తివేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని శానిటేషన్ మేస్త్రీలు, వర్కర్లను ఆదేశించారు. కమిషనర్ పంచెకట్టులో పర్యటించడం విశేషం.

నిత్యాన్నదానానికి రూ. 50వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద చేపడుతున్న శాశ్వత నిత్య అన్నదానం కోసం శనివారం ఆదోని వాస్తవ్యులు గుల్లెం శివమ్మ వారి కుటుంబ సభ్యులు రూ.50వేలను దేవాలయ కార్యాలయంలో నగదును అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫోటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల : ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణను సమర్థిస్తూ ఈనెల 18న కర్నూలు నగరంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరావాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహులు, శివ, నాగరాజు, రవి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ఎంపీడీఓ పుల్లయ్య సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. శనివారం గ్రామంలో సీసీ రోడ్లు, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పీఆర్ అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నరసింహులు, ఈఓపీఆర్డీ సందీప్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

- పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- రీచ్‌కు అనుమతులు లేకున్నా ఇసుక అక్రమ తవ్వకాలు
- నాగలదిన్నె నది తీరం నుంచి రోజూ 150 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా



నాగలదిన్నె నది తీరంలో ఇసుక ట్రాక్టర్లు

నందవరం : ఇసుకాసురులు పెట్రేగిపోతున్నారు. అధికారపార్టీ అండదండలతో ఇసుక మాఫియాకు బ్రేకులు లేకుండా పోయాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో యథేచ్ఛగా ఇసుక దందా సాగిపోతోంది. కార్యాలయాల మీదుగానే ఇసుక ట్రాక్టర్లు రయ్..రయ్ మంటూ తరలిపోతున్నా అధికారుల్లో చలనం కరువైంది. టన్నుల కొద్దీ ఇసుక అక్రమంగా తరలిపోతున్న చర్యలు మాత్రం శూన్యం.

ట్రాక్టర్ రూ.3,500 నుంచి రూ.5,000

మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది ఒడ్డున ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ ఇసుక రీచ్‌కు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో ఇసుకను తవ్వుకునేందుకు వీలులేదు. అయినా ఇక్కడి నుంచి రోజుకు 150 ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం అధికార పార్టీ అండ దండలతో ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇసుక చోరులు ట్రిప్పు ఇసుక రూ.3,500 నుంచి రూ.5,000 వరకు అమ్ముకుని దండుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా మండల కేంద్రం నందవరం మీదుగా ఎమ్మిగనూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

నాగలదిన్నె నుంచి రవాణా

నాగలదిన్నె నది తీరం నుంచి ఎమ్మిగనూరు, మంత్రాలయానికి పెద్దకొత్తిలి, గంగవరం, నదికైరవాడి గ్రామాల వైపు ఇసుకను తరలిస్తున్నారు. ఎమ్మిగనూరు వైపు వెళ్లె ట్రాక్టర్లు నందవరం మీదుగా వెళ్తున్నాయి. అలాగే మరొవైపు కనకవీడు, పేట, తిమ్మాపురం మీదుగా ఎమ్మిగనూరుకు ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండ దండలతో అక్రమ దందా సాగు పోవడంతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వినికిడి. అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించినా ఇసుకాసురులు వారిని పట్టించుకోకపోవడం విడ్డూరం.

అధికారుల నిర్లక్ష్యం

అధికార పార్టీ అండదండలకు అధికారులు సైతం తలలు వంచుతున్నారు. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. కొందరు అధికారులు తొత్తులుగా మారి మాఫియాకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. కార్యాలయాల ఎదుటే ట్రాక్టర్ల మోత మోగుతున్నా చెవికెక్కించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాల్టా చట్టాన్ని పరిరక్షించాలన్నా కనీస బాధ్యత లేకపోయింది. అధికారుల తీరును, ఇసుక మాఫియా ఆగడాలను చూసి ప్రజలు నివ్వెర పోతున్నారు. రాత్రి వేళల్లోనూ ట్రాక్టర్ల చప్పుళ్లతో నదీతీర వాసులు విసుగెత్తిపోతున్నారు. ఇకనైనా అధికారులు చలించి ఇసుకాసురుల ఆటకట్టించాలని కోరుతున్నారు.

“కఠిన చర్యలు తీసుకుంటాం



ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వ నింబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటాం. నాగలదిన్నె నదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందింది. దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే మూడు ట్రాక్టర్ల సీజ్ చేసి జరిమానా విధించాం. అలాగే డ్రైవర్లు, ఓవనర్లపై కేసులు నమోదవుతాయి. ప్రభుత్వ నింబంధనలు అనుసరించి మాత్రమే ఇసుక తరలించాలి. ఏవిధమైన అనుమతులు లేకున్నా అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. అనంతరం భారీ జరిమానాలను విధిస్తాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్, నందవరం

నేడు కార్తీక వనభోజనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శంకరమఠం సమీపంలో ఉన్న భారతి తీర్థ ఉద్యానవనంలో ఆదివారం కుల మతాలకు అతీతంగా కార్తీకవన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారతి తీర్థ ఉద్యానవనం ట్రస్ట్ సభ్యులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడ్, హనుమంతరెడ్డి, శివరామిరెడ్డి, డా.గోవిందరాజు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 గంటలకు గరుడాద్రి శర్మ గారిచే ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 3గంటల నుంచి సాంఘిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి

నందవరం : కూటమి ప్రభుత్వం నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. 18న సచివాలయా వద్ద నిర్వహించే సీపీఐ ధర్నా కరపత్రాలను శనివారం మండల కేంద్రంలోని సంత మార్కెట్ ఆవరణలో సీపీఐ నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీలను నేరవేర్చాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో పేదల 2 సెంట్ల ఇళ్ల స్థలాలను ఇవ్వాలాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు ఆంజనేయులు, సొంతన్న, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు శ్రీనివాసులకు నోటీసు ఇస్తున్న పోలీసులు

ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విజయవాడలో ఈ నెల 18న జరిగే మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన విద్యాదీవెన, వసతిదీవెన రూ.3,480 కోట్లు పెండిగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయంపై పలుమార్లు విన్నవించిన నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేవలం విద్యారంగానికి కేవలం రూ. 5,387.03 కోట్లు మాత్రమే కేటాయించందని తెలిపారు. 18న విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమం జరుగుతుంది, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సూరి, గౌస్, లోకేష్, గణేష్, శశిధర్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, మండల అధ్యక్ష కార్యదర్శులు పవన్, రంగస్వామిలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల నందు ధర్నాకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు.

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఆదోని సెంట్రల్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించమంటే అక్రమ కేసులను బనాయించడం సరి కాదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన మహాధర్నాకు పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులకు నోటీసులను జారీ చేసి అరెస్టు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు శ్రీనివాసులకు నోటీసు జారీ చేసి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

పీఠాధిపతికి ఆహ్వానం



పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న హైందవ శంఖారావం సభ్యులు

మంత్రాలయం : విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం సభకు రావాలని మంత్రాలయం మంఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను జిల్లా హైందవ శంఖారావం కో కన్వీనర్ న్యాయకంటి భీమా రెడ్డి ఆహ్వానించారు. శనివారం మంఠంలో పీఠాధిపతికి ఆహ్వాన పత్రిక అందజేశారు . టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు మంత్రాలయం సూర్యనారాయణ చార్యులు, విశ్వ హిందు పరిషత్ నాయకులు భీమా లింగారెడ్డి, శ్రీరాములు యాదవ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్: గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాలికల పాఠశాల ఉపాధ్యాయులు కేశమ్మ, శివజ్యోతి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు శారమ్మ అన్నారు. శనివారం గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో జాతీయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, డా.ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలికల పాఠశాల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హరికృష్ణ, ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రంగస్వామి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు శారద, ఉమ, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రిన్సిపాల్‌కు మళ్లీ అక్కడే పోస్టింగా?

ఎమ్మిగనూరుటౌన్: అక్రమాలకు పాల్పడినందునే స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితపై విచారణ చేసిన అధికారులు విధుల నుంచి తొలగించారని.. ఆమెకు మళ్లీ అక్కడే పోస్టింగ్ ఎందుకు ఇచ్చారని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు మళ్లీ అదే పాఠశాలకు పోస్టింగ్ ఇవ్వడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఆయా విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, శేఖర్, వీరేష్‌యాదవ్, సురేంద్రబాబు,సోమేశేఖర్, ఖాజ,అఫ్రిద్, వెంకటేష్, నాగరాజు మాట్లాడారు. విద్యార్థుల కడుపులు మాడ్చి వారి సొమ్మును కాజేసిన ప్రిన్సిపాల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, అలెగ్జాండర్, తిమ్మప్ప, ఈరన్న, చరణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆదోనివాసి మృతి

ఆదోని అర్బన్/బత్తలపల్లి: అనంతపురం జిల్లా బత్తలపల్లి గ్రామ సమీపంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆదోనికి చెందిన అనిల్(35) మృతిచెందాడు. అనిల్ మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడని స్థానికులు తెలిపారు. ఇంట్లో పనికి వెళ్లమని చెప్పగా.. అలిగి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. అనంతపురం నుంచి బత్తలపల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు.

టీచర్లను నియమించాలి

ఆదోని రూరల్: మండలంలోని ఢణాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, టీచర్లను నియమించాలని డీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు హరి, హనుమేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉమేష్, శ్రీకాంత్, మల్లప్ప, అరుణ్ పాల్గొన్నారు.

విప్లవం ద్వారానే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మహ్మద్ రషీద్

ఆదోని రూరల్: ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమని దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్‌రషీద్ అన్నారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చంద్రపుల్లారెడ్డి 40 వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ లక్షలాది ఎకరాల భూమిని ప్రజలకు స్వాధీన పరిచిన కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి చేపట్టిన విప్లవ ప్రతిఘటన ఉద్యమంలో వేలాదిమంది అమరులయ్యారన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రజా సంఘాల నాయకులు యేసేపు, అనీఫ్, వెంకప్ప, అరుణోదయ రామ్‌చందర్, దళిత సంఘం నాయకులు నరసన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలి

కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ శివనాగేశ్వరరావును సస్పెండ్ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిందన్నారు. దీంతో రైతుల పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను సంబంధిత వ్యవసాయ అసిస్టెంట్లకు ఇవ్వాలని మండల అధికారులు తెలిపారన్నారు. దీనిని ఆసరా చేసుకున్న శివనాగేశ్వరరావు రైతుల నుంచి రెండు వందలు ఇస్తేనే మీకు నష్టపరిహారం వస్తుందని, లేదంటే ఎలాంటి పరిహారం రాదని రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు దీనిపై విచారణ జరిపి శివనాగేశ్వరరావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ఉన్నత పాఠశాలల్లో మత పరమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతిచ్చిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం ఈవిషయంపై స్థానిక ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో మత పరమైన కార్యక్రమాలకు ప్రోత్సహించడం సమంజసం కాదంటూ ఆసంఘ నాయకులు నిలదీశారు. రాజేష్ మాట్లాడుతూ కొంత మంది విశ్వ హిందూ పరిషత్ పేరుతో పాఠశాలల్లో భగద్గీత తదితర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని, ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి పంపిణీ చేయడం పద్ధతి కాదన్నారు. ఇలా రోజుకో మతం వారు వచ్చి గ్రంథాలను పంపిణీ చేసుకుంటూ పోతే వివాదాలు తలెత్తే అవకాశం వుందన్నారు.

వర్షాధార పంటలకే నష్టపరిహారం

కౌతాళం: మండలాన్ని ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందని, అయితే వర్షాధారం కింద సాగు చేసిన పంటలకు మాత్రమే నష్టపరిహారం వర్తిస్తుందని ఏఓ శేషాద్రి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కింద సాగు చేసిన వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలు నష్టపరిహారం కింద రాస్తున్నామన్నారు. వీటిలో కూడా నీటిపారుదల కింద ఏదైనా పంట వేసి ఉంటే వాటికి నష్టపరిహారం వర్తించదని స్పష్టం చేశారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న వాళ్లకు మాత్రమే ఇందుకు అర్హులు అన్నారు. ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరిగా చేసి ఉండాలని, లేనిచో పరిహారం రాదన్నారు. రైతులు సంబంధించిన బ్యాంకులో ఎంపీసీఐ లింక్‌ను తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు.

మొబైల్ ఎక్స్‌రే వాహన సేవలు సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : టీబీ ఉచిత మొబైల్ ఎక్స్‌రే వాహన సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి తాహేర్, టీబీ సూపర్‌వైజర్ స్వరూప్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన మండల పరిధిలోని హెచ్.మురవణి, 19న పెద్దకడబూరు, 21న చిన్నతుంబళం, 22న ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామాలలో ఉచిత మొబైల్ ఎక్స్‌రే వాహనం పర్యటిస్తుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎక్స్‌రే పరీక్షలు చేయించుకొని టీబీ వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, మట్కా బీటర్ల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ , ఎస్ఐ

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో మట్కా రాస్తు, కర్ణాటక మద్యం బాటిళ్ల విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సమక్షంలో మట్కా బీటర్ల అరెస్టును చూపించారు. వారు మాట్లాడుతూ కోసిగికు చెందిన బసవరాజు, కుమ్మరినాగరాజు, లింగారెడ్డి, ఈరన్న అలియాస్ పక్కీరప్ప, వెంకటేష్ బస్టాండ్‌లో ఆవరణలో దర్జా మట్కా రాస్తుండగా.. వారి వద్ద నుంచి నాలుగు మట్కా చీటీలు, రూ.27,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 705 కర్ణాటకకు చెందిన ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు



శ్రీనివాస థియేటర్ సర్కిల్ వద్ద రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సర్కిల్ నుంచి మార్కెట్ యార్డ్ కమిటీ వరకు రోడ్డు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం సర్వే చేయించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పడికే శివ సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు, అక్కడి నుంచి ఓంశాంతి సర్కిల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి నలువైపుల రోడ్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం కమిటీ రోడ్డు, శివ సర్కిల్ నుంచి గోనెగండ్ల బైపాస్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అంతకు మునుపు షరాఫ్ బజార్, లక్ష్మీపేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కోసిగి: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు విద్యార్థినులకు సూచించారు. శనివారం కోసిగిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ షబానా అజ్మీన్ ఆధ్వర్యంలో సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌లతో కలిసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యం పెట్టుకుని చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఎప్పడికప్పుడు చదువుకోవాలన్నారు. అలాగే సమాజంలో మహిళలు, బాలికల పై జరుగుతున్న దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



మాట్లాడుతున్న లివింగ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

పెద్దకడబూరు : ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమని లివింగ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు విజయన్ (ఫ్రాన్స్), విజయన్ (ఇండోనేషియా), రంగనాయకులు సూచించారు. మండల కేంద్రలోని రమాకాంత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద ఆయిల్ పామ్ సాగుపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటను ఆశించే పురుగులు చాలా తక్కువన్నారు. పంట దిగుబడులు 4వ సంవత్సరం నుంచి ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ పంటకు ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ. 13,652 ఉందన్నారు. ఆయిల్ పామ్ పథకం కింద హెక్టారుకు సబ్సిడీ రూ. 12వేల దాకా ఉంటుందన్నారు. ఈ పంటను సాగు చేసుకోవడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కే.రాఘవేంద్ర చౌదరి, మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్, ఉద్యాన అధికారి అపర్ణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం మాఫియాను శిక్షించాలి

ఆదోని అర్బన్: పేదలకు ఉచితంగా అందాల్సిన ప్రభుత్వ ఉచిత బియ్యాన్ని కొందరు రేషన్ మాఫియా స్మగ్లర్లు రాజకీయ అండతో పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి నూర్‌అహ్మద్ ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నీతి నిజాతీగా పరిపాలిస్తానని, అవినీతిని సహించనని ప్రగల్బాలు పలికే ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి తన చుట్టుపక్కనే స్మగ్లర్లు ఉన్నా గుర్తించలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇవన్నీ ఆయనకు తెలిసే జరుగుతున్నాయా లేదా.. ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్‌లో సీఐ ప్రమేయంపై రాయలసీమ రేంజ్ ఐజీకి, కర్నూలు జిల్లా ఎస్పీకి ఎంహెచ్‌పీఎస్ తరపున ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా గౌరమ్మ పండుగ



గౌరమ్మకు చక్కెర హారతి ఇస్తున్న మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలో గౌరమ్మ పండుగను మహిళలు, చిన్నారులు శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం ఆలయాల్లో గౌరమ్మ కొలువుదీరింది. ఐదు రోజులపాటు మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కోసం పిండి వంటలు చేసుకుని, అమ్మవారికి చక్కెర హారతులను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా వీధుల్లోని ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు మహిళలు, చిన్నారులు ఊరేగింపుగా చక్కెర హారతులతో వెళ్లి అమ్మవార్లకు పూజలు చేశారు. రాత్రి అమ్మవారి నిమజ్జనోత్సవం చేపట్టారు.